సుచరిత



# మళ్లీ ఎప్పటికి?

మబ్బుల చాటునుంచి చందమామ తొంగి చూస్తున్నాడు రాజకుమార్తె జడపాయ లోంచి వెండిపువ్వులా!

చల్లగాలి యీలపాటలు పాడుతోంది.

పార్వతి మొదటిసారిగా ఆ విషయం చెప్పినప్పుడు గిరీశం—

"నిజంగా!" అంటూ హర్షం వెలిబుచ్చ లేదు

"నాకు బాబు కావాలి పారూ!" అంటూ చిలిపి వాదన పెట్టుకో లేదు. కనీసం చిరు నవ్వయినా నవ్వలేదు.

పైగా దివాలా తీసిన షావుకారులా మొహం పెట్టి "అప్పుడే!?" అన్నాడు

పార్వతి ఏదో నేరం చేసినదాన్లా ఫీలయింది. "అంతే?" అంది మాట పెగుల్చుకుని.

"పెళ్ళయి ఎన్నాళ్ళయిందనీ?" గిరీశం ప్రశ్నించి తనే ఓ క్షణం ఆలోచించి "రెండేళ్ళేగా?" అన్నాడు పరధ్యానంగా!

పార్వతి జవాబు యివ్వలేదు చాలా రోజుల తర్వాత పార్వతి మనసంతా వుల్లాసంగా అంతులేని ఆనందంగా వుంది. అంత ఆనందమూ భరించటం తనవల్ల కాక గిరీశంతో చెబితే యెంత వుత్సాహకరంగా మాట్లాడాడో చూశారుగా!

రొటీన్ విసుగ్గా వుంది పొద్దంతా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవాలంటే చిరాకు! అందుకే ఓ తోడు కావాలి తను చెప్పే ప్రతిదీ విని 'వూ' కొట్టే ప్రాణి కావాలి! తనని చుట్టుకుని తిరుగుతూ గంటల్ని క్షణాల్లా గడిపింప చేసే ఓ పాపాయి

కావాలి! ఈ ఒంటరితనం భరించటం తన వల్ల కాదు.

గిరీశం యింట్లో శలవు వచ్చి వున్నా లాభంలేదు. అతను ఎక్కువగా మాట్లాడే మనిషి కాడు. ఆదివారం వచ్చిందంటే అన్నం తినటం ఆలశ్యం....మంచం మీద పడుకుని ఎంత వేసవికాలమయినా సరే ముసుగు తన్నేస్తాడు. వెయ్యి ఏనుగులచేత తొక్కించినా లేవడు. నిద్రలో కాంపిటీషన్ పెడితేను....అతనిదే ఫస్టు!

మధ్యాహ్నలు పార్వతికి నిద్ర అలవాటు లేదు.

కాస్సేపు నిద్రపోతున్న గిరీశం కేసి చూస్తుంది. ఇంకాసేపు యింటి దూలాలు లెక్కపెడుతుంది.

ఇంకా విసుగనిపిస్తే వంటింట్లో కెళ్ళి సర్దినవే సర్దుతుంది. అనవసరంగా పిళ్ళు పిసురుతుంది. అవసరం లేకపోయినా డబ్బాలు బోర్లించి పప్పులు బాగుచేస్తుంది.

గిరీశం మేలుకుని వున్నా వుపయోగం ఏం లేదు.

కొంతమంది మనుష్యులు వుంటారు. వాళ్లు ఓ గిరిగీసుకుని అందులోంచి చచ్చినా బయటికి రారు. ఇంకోళ్ళని రానివ్వరు తమ చేరువలోకి ఎంత ఆప్తుల్నయినా సరే!

పార్వతికి తను తల్లి కాబోతున్నదని తెలియగానే ఎక్కువ ఆనందం కల్పించిన విషయం యింకోటి కూడా వుంది.

హాయిగా కొన్ని నెలలపాటు విశ్రాంతి. పుట్టింటికి వెళ్ళిపోవచ్చు. పుట్టిల్లు తలుచుకోగానే పార్వతి మనసు పులకరించింది. 'అబ్బ! ఎన్నాళ్లయింది తను అమ్మనీ నాన్ననీ చూసి! నాళ్ళు కాదు నెలలు! ఒకటి కాదు, రెండు కాదు. తొమ్మిది నెలలు!'

అక్క వుత్తరం రాసేప్పుడల్లా దెప్పుతుంది. 'ఏమమ్మా! మరీ మొగుడిని ఒక్కవారమయినా వొదల్లేవూ?' అంటూ.

కానీ అది కాదు సంగతి.

కొత్తల్లో ఓసారి పార్వతి "మావూరు వెళ్ళి అందర్నీ చూసి వస్తాను." అంది.

"నేను పంపించను" అన్నాడు గిరీశం చండీలా!

పార్వతి అభిమానం దెబ్బతిన్నది. మళ్ళీ అడగలేదు నోరు తెరచి. గిరీశం పంపించకపోవటానికి అసలు కారణం పార్వతికి తెలీకపోలేదు. దీపావళికి పిల్చిన మామగారు అడిగిన స్కూటర్ యివ్వలేదని గిరీశానికి కోపం మనసులో. కానీ పైకి తేలడు.

పార్వతికి నిద్ర వచ్చింది అలసటతో.

తను పుట్టింటికి వెళ్ళినట్టూ....అక్కయ్యలతో సరదాగా కబుర్లు చెబుతూ అన్నం తింటున్నట్టూ...అమ్మ అన్నంలోకి గులాబ్ జామ్ చేసినట్టూ....తియ్య తియ్యని కలలు వచ్చాయి.

* *

రెండు రోజుల తర్వాత వుదయం తొమ్మిది గంటల వేళ—

గిరీశం కుర్చీలో కూర్చుని బూట్లు నిగనిగ లాడేలా పాలిష్ చేస్తున్నాడు.

పార్వతి గుమ్మంలో కూర్చుని బియ్యం ఏరుతోంది ఆ పూట అన్నం కోసం.

"సాయంకాలం కాస్త త్వరగా రాకూడదూ? డాక్టర్ దగ్గరికి వెళ్దాం!" అంది పార్వతి.

"ఎందుకూ?" అన్నాడు గిరీశం బూట్లకేసి చూసుకుని తన పనితనానికి మురిసిపోతూ

"నీరసంగా వుంటోంది ఏమి తిన్నా వెళ్ళిపోవటమే!"

"ఇవన్నీ యీ టైమ్‌లో అందరికీ వుండే లక్షణాలే! నీకు ప్రతిదీ అనుమానమూ, ఖంగారూ! ఈ రోజుల్లో యీ డాక్టర్లూ- యీ మందులూ వచ్చాయిగానీ వెనక మా అమ్మ శీనూని యింకో అర గంటకి నీళ్ళాడతాననంగా కూడా అడ్డమైన చాకిరీ చేసేది!" గిరీశం సభా మధ్యంలో కూర్చుని క్లిష్టసమస్యని పరిష్కరిస్తున్న చక్రవర్తిలా మొహం పెట్టి అన్నాడు.

'ఎంత నిర్లక్ష్యం' పార్వతికి వొళ్లు మండిపోయింది. అతని కెప్పుడయినా కాస్త తలనొప్పి వస్తేనే యిల్లు పీకి పందిరి వేస్తాడే! ఇతర్లు మాత్రం అలా కాదూ?

"ఆడదానికి ప్రసవం యింకో జన్మ అంటారు జాగ్రత్తగా వుండాలి" సిగ్గు అన్పించింది పార్వతికి అలా మాట్లాడవలసి వచ్చినందుకు.

"పిచ్చి అనుమానాలూ—భయాలతో మనసు పాడుచేసుకోక పార్వతీ! అడవిలో చెట్ల కెవరు నీళ్ళు పోస్తున్నారు? చెట్లకింద పురుళ్ళు పోసుకున్నవాళ్లని నే నెరుగుదును" తత్వవేత్తలా మాట్లాడాడు గిరీశం.

"అవును అడవిలో చెట్లకి నీళ్లు ఎవరూ పొయ్యరు. కానీ మనం అపురూపంగా అతి సున్నితంగా పెంచే మొక్కలు ఒక్కరోజు నీళ్లు పొయ్యకపోయినా చస్తాయి!" కచ్చిగా అంది పార్వతి.

గిరీశం విన్పించుకోకుండా లోపలికి వెళ్ళిపోయాడు.

పార్వతి కా క్షణంలో ఏరుతున్న చాట ఎత్తి అతని మీద గుమ్మరించి అన్నం వొండకుండా పడుకోవాలన్నంత తిక్క రేగింది ఇప్పుడే గనక అమ్మ వుంటే . తనని ఒక్కపని చెయ్యనిచ్చేదా? మంచం లోంచి దిగనిచ్చేదా? పార్వతికి నీరసంతో ఏడుపు ముంచుకొచ్చింది

సాయంకాలం గి రీ శ ం వచ్చేసరికి పార్వతి పడుకుని వుంది గిరీశం లోపలి కెళ్ళి స్నానం చేసి 'కాఫీ!' అంటూ వచ్చాడు

పార్వతి నెమ్మదిగా లేచి ఫ్లాస్కులో కాఫీ వొంపి యిచ్చింది.

"అలా వున్నావేం?" అడిగాడు కాఫీ గ్లాసు బల్ల మీద పెట్టేస్తూ.

"ఈ టైమ్‌లో అందరికీ వుండేవే!" పార్వతి మామూలుగా వుండటానికి ప్రయత్నించింది

గిరీశం లేచి షర్టు వేసుకున్నాడు

"ఎక్కడికి?" పార్వతి అడిగింది

"అలా పార్కుదాకా!"

పార్వతి వెళ్లవద్దని చెప్పాలనిపించి మళ్ళీ వూరుకుంది. ఎవరిది వాళ్లకు తోచాలి. ఇంకోళ్ళు ఎందాకా పోరుతారు?

అతను గుమ్మం దాటబోతుంటే నెమ్మదిగా "ఈ పూట వంట చెయ్యలేదు వస్తూ హోటల్లో తినిరండి" అని చెప్పింది.

గిరీశం వెళ్లిపోయాడు పార్వతి చూస్తూ కూర్చుంది.

చిన్న ఓదార్పు మాట చెప్పే ఓపికలేదు అతనికి

గిరీశం స్నేహానికి ప్రాణం యిస్తాడు. స్నేహితులతో గంటల తరబడి హస్కు వేసుకునే అతను ఇంటికి వస్తూనే మూగ నోము పట్టటం పార్వతి చాలాసార్లు గమనించింది. ఇంట్లో వాళ్లతో తూచి తూచి మాట్లాడతాడు

"ఏమైనా కబుర్లు చెప్పండి" అంటూ పార్వతి ప్రాణం తీస్తే—"ఆడాళ్ళతో ఏం మాటలుంటాయి పార్వతీ!" అంటాడు చికాగ్గా. భార్యతో కులాసాగా నాలుగు మాటలు చెప్పటానికి ఏమీ టాపిక్కే దొరకదా? ఏం చిత్రమయిన మనుషులు!

పార్వతి నిట్టూర్చింది

మహా మహా తండ్రిని చంపిన ఔరంగజేబులోనే ఎన్నో మంచి గుణాలున్నాయి. గిరీశాన్ని గురించి ఎప్పుడూ చెడుగా ఆలోచించటమూ, అసంతృప్తితో ద్వేషించటమే తన లక్ష్యం కాదు గిరీశంలో తనకు యిష్టమయ్యే గుణాలు మాత్రం లేవూ? బాధ్యతల్ని విస్మరించనివాళ్ళంటే పార్వతికి అంతులేనంత గౌరవం! పంక్చువాలిటి మెయిన్‌టెన్ చెయ్యటంలో గిరీశం తర్వాతే ఎవరినయినా చెప్పాలి

చాలామంది ఆడవాళ్ళు కోరుకునే ఇంకో సుగుణం గిరీశంలో వుంది. అది ఏమిటంటే నెల రోజుల ముందునుంచి పోరకుండానే ప్రతి పండక్కి చీర తెచ్చి పడేస్తాడు ఆ చీర తర్వాత పార్వతి కట్టుకుందా లేదా అన్న సంగతి అతనికి పట్టదు కనీసం ఏమయింది అనయినా అడగడు

కానీ చిక్కేమిటంటే భార్య ఇష్టం గమనించే తీరిక—ఓపిక అతనికి లేవు తాను తెచ్చే చీరలు పార్వతికి నచ్చుతాయా లేదా అని అతను తలుచుకోనయినా తలుచుకోడు.

పెళ్ళిలో తన చీరల సెలక్షన్ పెళ్ళికొడుకుదే అన్న సంగతి తెలిసి పార్వతి నీళ్ళు కారిపోయింది ఎందుకంటే ఆ చీరల రంగులన్నీ తనకు నచ్చనివే. పైగా వాటి మీద పూర్తిగా అడవితీగలు అల్లుకుని ఒకదానితో ఒకటి పెనవేసుకున్నట్టుగా 'గాడీ' ప్రింట్స్!

* * *

రెండు రోజుల తర్వాత రాత్రి, పడుకోబోతూ గిరీశం అన్నాడు "రేపు ఆదివారం మా ఫ్రెండ్, అతని శ్రీమతి భోజనానికి వస్తారు"

విని వూరుకుంది

తనే చెప్పాడు గిరీశం "వాళ్లు ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతున్నారు నాకు చాలా దగ్గిర ఫ్రెండు అందుకోసం పిలిచాను"

"మంచిదే!" అంది పార్వతి ముభా వంగా

"ఏం చేస్తావు రేపు?"

"మీ యిష్టం!"

"పులిహోర చెయ్యి అతనికి చాలా యిష్టం! ఏదయినా స్వీట్ కూడా!" పార్వతి గుండెలో కలుక్కుమంది. అతనికి పులి హోర యిష్టం! కాబట్టి రేపు చెయ్యాలి! ఎంత ప్రేమా!

"ఒక్కసారే చెప్పండి యింకా యింకా ఎవరెవరికి ఏది యిష్టమో!"

"ఎందుకు పారూ అంత కోపం?"

"కోపమా? నా కోపం ఎవరికి లెఖ్ఖ? మన యిద్దరికి చేసేసరికే నా ప్రాణాలు పోతున్నాయి పైగా రేపు ఆదివారం! వారాల కుర్రాళ్లు యిద్దరు వస్తారు నా నీరసం విషయం మాత్రం మీకు పట్టదు. బయటివాళ్ళమీద చూపించే ప్రేమలో ఒకటో వంతయినా కట్టుకున్న పెళ్ళాం మీద చూపిస్తే ఎంత బావుం " పార్వతి కళ్ళల్లోంచి ధారలుగా కన్నీళ్లు వస్తున్నాయి. ఆవేశంతో మాట్లాడలేకపోయింది.

గిరీశం నెమ్మదిగా చేత్తో పార్వతి వీపు నిమిరాడు "ఊరుకో! ఏడవక! పారూ! రేపు డాక్టరు దగ్గరికి వెళ్దాంగా! అరె వూరుకో ప్లీజ్!"

పార్వతి కళ్లు తుడుచుకుంది

"పోనీ ఒక్క అన్నం ఒండెయ్యి స్వీట్స్—అవీ హోటల్‌నుంచి తెస్తాను"

"అబ్బే! వొద్దులెండి ఒక్కగంటలో చేసేస్తాను ఎంతసేపనీ!"

పార్వతి చిరునవ్వు నవ్వింది, శిలల మీద సూర్యకిరణం తళుక్కుమన్నట్టుగా!

కానీ రేపటి రోజుని తలుచుకోగానే మనసు మాత్రం ఝల్లుమన్నది

* * *

ఎనిమిది నెలలు నిండుతూంటే తల్లి వుత్తరం రాసింది—తొమ్మిదో నెల రాగానే పార్వతిని పంపించమంటూ

"ఇక్కడ మంచి ఆసుపత్రులు వున్నా యిగా! మీ అమ్మ ఇక్కడికే వస్తే నువ్వు పురుడు ఈ వూళ్లోనే పోసుకోకూడదూ?" గిరీశం అన్నాడు వుత్తరం మడుస్తూ.

"వీల్లేదు వీల్లేదు" పార్వతి వెంటనే అంది

"ఏం?"

"ఆడదాని మనసు మీకు తెలీదు పుట్టిన వూరూ . పెరిగిన ఇల్లూ చూస్తూనే జీవం పరిగెడుతుంది నరాల్లో. నేను అక్కడికే వెళ్తాను"


"నేను పంపించనంటే ?"

పార్వతి విలవిలలాడుతున్నట్టు చూసింది

"భయపడక! నీ వుసురు నాకెందుకు? కానీ ఒక్క షరతు"

"ఏమిటి?"

"తర్వాత మళ్ళీ నెలకల్లా వచ్చె య్యాలి" పార్వతి అయిష్టంగా వూరు కుంది కాదంటే అసలు వొద్దంటాడేమో! అతని మొండితనం కొత్తకాదుగా!




వెళ్ళిపోయే రోజు దగ్గరౌతున్నకొద్దీ పార్వతికి గుండెల్లో ఏదో గుబులు ప్రారంభం అయింది

మళ్ళీ తను యీ యింటికి రాగలుగుతుందా? అంతా సవ్యంగా జరక్కపోతే భగవాన్! గిరీశం ఏమయిపోతాడు? తెల్లారి లేచిందగ్గర్నుంచి అన్నింటికి "పార్వతీ పార్వతీ!" అంటూ పిలుస్తూ వేణ్ణీళ్ళల్లో చన్నీళ్ళు కలుపుకోడం కూడా తెలీసి గిరీశం

ఎదురుగావున్న దువ్వెన వెతుక్కుంటూ ఇల్లంతా విసుక్కుంటూ తిరిగే గిరీశం తనకేదయినా జరిగితే!?

పార్వతి ఇల్లంతా పిచ్చిపట్టినట్టు తిరిగింది ఈ ఇంట్లో ప్రతి అణువూ తనకెంతో చిరపరిచితం! ప్రతి వస్తువూ తనకెంతో ప్రియమయినది. ఎంతో సన్నిహితమయినది. ఇన్నాళ్ళూ వీటితో యింత ఆత్మీయత వుందన్న సంగతి తనకీనాడే తెలిసింది ఇవన్నీ వొదిలేసి అమ్మో మూడు నెలలు! నూట ఎనభై రోజులు!

తిట్టుకుంటూనో, పోట్లాడుకుంటూనో ఎదురుగావుంటే ఆ హాయి వేరు

చిన్న చిన్న అసంతృప్తులు తప్పిస్తే గిరీశం ఎంత మంచివాడు! మనిషన్నాక ఏదో బలహీనత వుండకపోతుందా?

గిరీశం కన్నా దౌర్భాగ్యులయిన మొగుళ్లు ఎంతమంది లేరు?

పార్వతి అద్దంలో ప్రతిబింబిస్తున్న తన మనసుని చూసుకుని తనే ఆశ్చర్యపడింది

*   *   *

రాత్రికే ప్రయాణం!

పార్వతి బట్టలన్నీ సర్దుకుంది అన్యమనస్కంగా! గిరీశం మంచం మీద కూర్చుని పేపర్ చూస్తున్నాడు.

"అన్నం వేళకి తినండి ఏం?" పార్వతి అంది.

"ఊఁ!"

"పేస్టూ-బ్రష్, ఆ కిటికీలో పెట్టాను."

"ఊఁ"

"చాకలిపద్దు పరుపు కింద వుంది క్రితం వుతుకులో మీ పైజామా తీసుకురావాలి. అడగండి మర్చిపోకుండా!"

"ఊఁ!"

"పొద్దున కాఫీ కాచుకుంటారా? హోటల్‌కి పోతారా?"

"ఊఁ!"

పార్వతి పని ఆపి అతనికేసి తీక్షణంగా చూసింది ఈ మాటలేవీ వింటున్నట్టు లేదు మానవుడు! బీహారువరదల్లోనో-వియత్నాం యుద్ధంలోనో మునిగి వున్నాడు

ఇంకొక్క గంటసేపు కదా తను వుండేది కాస్త ఏవైనా కబుర్లు చెప్ప కూడదూ? తన భయాలు పొట్టవేనని ఓదార్పు మాటలు చెప్పకూడదూ? ఒక్రి అడవి అదిగో, మళ్ళీ యీ తుగ్లక్ మనసు మారుతోంది! వెనక్కి లాగుతోంది! అతని మనస్తత్వం తనకీనాడు కొత్తా?!

ఆడదానిలో ఈ మానసిక దౌర్బల్యమే లేకపోతే సీత రాముడిని క్షమించేది కాదు, అగ్ని పరీక్ష తర్వాత నిండుసభలో అంత పరాభవమూ జరిగి ద్రౌపది భర్తలతో మళ్ళీ అడవులకు వెళ్ళేదే కాదు

రైలు కదుల్తుంటే పార్వతి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి. "ఈ పిల్లలూ వొద్దు.... ఏమీ వొద్దు నీ దగ్గర వుంటే అంతే చాలు" అంటూ రైల్లో నుంచి దూకాలని పించింది పార్వతికా క్షణంలో.

గొంతు పెగుల్చుకుని "వుత్తరాలు రాస్తారుగా!" అని మాత్రం అంది

"ఆఁ! ఎలాంటి పిచ్చి భయాలు పెట్టు కోకు బి—ఎలర్ట్!" గిరీశం పార్వతి చెయ్యి నొక్కాడు ఆప్యాయంగా రైలు వేగం అందుకుంది.

---